## క్లుప్తంగా

### దివ్యాంగులకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించాలి

**నెహ్రూనగర్:** దివ్యాంగులకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని నవ్యాంధ్ర వికలాంగ హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డి. రమణయ్య కోరారు. ఈ మేరకు శనివారం మెప్మా పీడీ వెంకట నారాయణను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ టౌన్ వికలాంగుల సమాఖ్య(టీవీఎస్)లో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల్ని ఆర్పీలు, సీవోలు, సీఎంఎంలు పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో గతంలో ఉన్న సంఘాలన్నీ నిర్వీర్యం అయిపోతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు గ్రూపులు ఏర్పాటు చేసి, ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థికపరమైన చేయూతను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### గైనకాలజీ వార్డులో సిటీజీ మిషన్ ఏర్పాటు

**గుంటూరు మెడికల్:** జీజీహెచ్ గైనకాలజీ వార్డులో సీటీజీ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. గైనికాలజీ వార్డులో ఇలాంటి మిషన్లు పది వరకు అవసరమని, ప్రస్తుతం ఒకటి మాత్రమే అందుబాటులో ఉందని చెప్పారు. ఉన్న ఒకే ఒక మిషన్ ద్వారా కూడా అరకొరగా సేవలు అందుతున్నాయని, ప్రింట్ కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధుల నుంచి మిషన్‌ను కొనుగోలు చేస్తున్నామని, ఆదివారం తీసుకుని వచ్చి డెమో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా మరిన్ని మిషన్లను కొనుగోలు చేస్తామని తెలిపారు.

### బైక్ అపహరణ

**తెనాలి రూరల్:** బైక్ అపహరణపై కేసు నమోదైంది. పట్టణ సాలిపేటకు చెందిన గుంటూరు సురేష్‌బాబు శుక్రవారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూడగా కనబడలేదు. ఆయన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**బాలిక అదృశ్యం**

బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. పట్టణ ఇస్లాంపేట కట్టా వారి వీధికి చెందిన 14 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటోంది. చిరు వ్యాపారి అయిన ఆమె తల్లి శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నానికి తిరిగి వచ్చేసరికి బాలిక కనబడకుండా పోయింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

### భార్యపై భర్త దాడి

**గుంటూరు ఈస్ట్:** ఓ వ్యక్తి భార్యను రోడ్డుపై కొట్టి పెట్రోలు పోసేందుకు ప్రయత్నించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మారుతీనగర్ 5వ లైనులో నివసించే షేక్ బాజి రింగ్ రోడ్డు లోని ఓ స్వీట్ షాపులో పని చేస్తుంది. ఆమె భర్త సురేష్ మద్యం తాగి తరచూ అక్కడకు వెళ్లి గొడవపడుతుండేవాడు. దీంతో షాపు యజమాని బాజీని ఉద్యోగం నుంచి తీసివేశాడు. ఆమె శనివారం ఎస్వీఎన్ కాలనీలోని ఓ స్వీట్ షాపులో ఉద్యోగం కోసం వెళుతుండగా భర్త సురేష్ అడ్డగించి రోడ్డుపైనే కొట్టాడు. అనంతరం ఆమె మారుతీనగర్‌కు చేరుకోగా అడ్డగించి పెట్రోలు పోసేందుకు ప్రయత్నించాడు. బాజీ పరుగెత్తుకుంటూ తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి**

మతిస్థిమితం లేని వ్యక్తి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. దొప్పలపూడి సురేష్ (32) మతిస్థిమితం లేక కాగితాలు ఏరుకుంటూ తిరుగుతుంటాడు. బ్రాడీపేటలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం తీగలు పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరోగ్య భద్రతపై అవగాహన సదస్సు

**గుంటూరు రూరల్:** మహిళల్లో పౌష్టికాహారం లోపం వల్ల, విటమిన్ డీ లోపం వల్ల కలిగే నష్టాలను అధిగమించేందుకు తగిన ఆరోగ్య భద్రతలను పాటించి నివారించుకోవచ్చని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప తెలిపారు. నగర శివారుల్లోని లాం ఫాంనందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో తాడికొండ మండలం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విటమిన్ డి లోపం వల్ల వచ్చే వ్యాధులను వివరించారు. చిన్న పిల్లల్లో పెద్దవాళ్ళలో ఎముకలకు సంబంధించిన సమస్యలను వివరించారు. కోవిడ్ లాంటి అంటువ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ఆహారంలో విటమిన్ డి ఎంతో అవసరమని తెలిపారు. రోజు సూర్యరశ్మితోపాటు పాలు, గుడ్లు, పుట్టగొడుగులు, పెరుగు, చేపలు, నువ్వులు, జున్ను, మొక్కజొన్నలు ఆహారంలో తీసుకుంటూ ఉండాలన్నారు. విటమిన్ డి లోపం వల్ల త్వరగా అలిసిపోవటం, బరువు పెరగటం, అజీర్తి, ఎముకల సమస్యలు, తరచూ జలుబు చేయటం, దగ్గు వంటివి వస్తాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డీఆర్‌డీఏ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి వెంకటస్వామి కృషి

**వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్**


వివేక్ వెంకటస్వామిని సత్కరిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, ఇతర నాయకులు

**నెహ్రూనగర్:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి గడ్డ వెంకటస్వామి ఎనలేని కృషి చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. సంకూరి మేరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకటస్వామి 95వ జయంతి వేడుకల్ని బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా కార్మిక వర్గాల అభిమానం చూరగొనడంతో పాటు జాతీయస్థాయిలో గుడిసె నిర్వాసితుల సంఘాన్ని ఏర్పాటు చేసి లక్షలాది మంది పేద, బడుగు, బలహీన వర్గాల అభిమానాన్ని చూరగొన్న వెంకటస్వామి చిరస్మరణీయులని కొనియాడారు. వెంకటస్వామి కుమారుడు మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఏడుసార్లు పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా పనిచేసి నీతి, నిజాయతీలకు మారుపేరుగా తన తండ్రి పేదల, కార్మికుల అభిమానం చూరగొన్నారని తెలిపారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తానని చెప్పారు. అనంతరం వివేక్ వెంకటస్వామిని ఘనంగా సత్కరించారు.

## అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ
- గుంటూరులో అర్చకుల సమస్యలపై సమీక్ష సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

**గుంటూరు ఈస్ట్:** రాష్ట్రంలో అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. కొత్తపేట దేవదాయ శాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అర్చకుల సమస్యలపై అధికారులతో కలిసి కమిషనర్ సత్యనారాయణ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనువంశిక అర్చకుల పరిరక్షణే ధ్యేయంగా వారి పేర్లు నమోదు చేసుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,539 మంది అర్చకులను గుర్తించామన్నారు. రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవలయాల్లో ఫౌండర్ ట్రస్టీ లేక అనువంశిక అర్చకులకు ఆలయ నిర్వహణ అప్పజెప్పడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జోన్ పరిధిలో 39 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ధూప దీప నైవేద్యం కింద 4,700 దేవాలయాలకు రూ. 5వేలు ఇస్తున్నామన్నారు. కనీస వేతనం 3,205 మందికి ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నవరం, కాణిపాకం తదితర దేవాలయాల తరపున ధర్మ ప్రచార రథాలను నిర్వహిస్తున్నామన్నారు. సింహాచలం, విజయవాడ, శ్రీశైలం తదితర పెద్ద దేవాలయాల్లో ధర్మ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 6ఏ పరిధిలోని దేవాలయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతు భరోసా కింద అర్చకుల పేర్ల నమోదుకు కలెక్టర్లతో మాట్లాడి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్చకుల భూములు అడంగల్‌లో అనుభవదారులుగా పేర్లు చేర్చే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా పలువురు అర్చక సమాఖ్య నాయకులు, అర్చకులు తమ సమస్యలను కమిషనర్‌కు నేరుగా తెలియజేశారు. అందుకు వెంటనే కమిషనర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అంకమ్మదేవాలయం పునర్నిర్మిస్తాం..**

గుంటూరు గ్రామ దేవత పాతగుంటూరులోని అంకమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరిందని విలేకరులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఆలయాన్ని పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేసీ సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రేయబాబు, గుంటూరు ప్రతినిధి అనంతాచార్యులు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఈఓలు, అర్చకులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పెదకాకాని:** క్రిమిసంహారక విష మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం, వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన బొడ్డు చలపతిరావు కుటుంబం వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ నెల 5వ తేదీ తెల్లవారు జామున పొలానికి వెళ్లిన ఆయన ఎలుకలను చంపడానికి ఉపయోగించే విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాంతులు చేసుకుంటున్న చలపతిరావును చూసిన కానుగోలు వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడు చలపతిరావును చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న చలపతిరావు(57) పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. కౌలు పొలం సాగు చేస్తూ అప్పులపాలైన తన తండ్రి అప్పులు తీర్చలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుమారుడు నాగపవన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

### చలపతిలో ముగిసిన వర్క్‌షాప్

**గుంటూరు రూరల్:** వర్క్‌షాపుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతకు మెరుగులు దిద్దవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గత ఐదు రోజులుగా జరుగుతున్న పైతాన్ ప్రోగ్రాంపై వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుంటూ సద్వినియోగించుకోవాలన్నారు. డెవలప్ ట్రీస్ ప్రతినిధి శ్రీహరిరాజు, మల్లికార్జునరావులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ రంగంలో అపార అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు యాప్ డిజైన్, వెబ్‌సైట్ డిజైన్, వివరించారు. డాక్టర్ కేవీ రామారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన కళలను భవిష్యత్ తరాలకు అందించాలి


జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరించిన శేషు రాణి, మస్తానయ్య తదితరులు

**పాత గుంటూరు:** భారతీయ ప్రాచీన కళలను, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం వాగ్గేయకార సంగీత మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ కళాకారులు తమ కళాప్రదర్శనలు నిర్వహించడానికి ప్రతి జిల్లా స్థాయిలోను ఒక ఆడిటోరియం ప్రజలు, సేవాసంస్థలు, ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రంగాల్లో ఉండే మహిళలు గాయత్రీ మహిళా సంగీత సన్మండలి పేరున సంగీత రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేయడం ప్రశంసనీయం అన్నారు. సభకు సంస్థ ప్రధానకార్యదర్శి ఎం.వై. శేషురాణి అధ్యక్షత వహించారు. సభలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఏ హైమావతి తదితరులు ప్రసంగించారు. సభానంతరం ప్రముఖ సంగీత విద్వాంసులు డి.వి.మోహన్‌కృష్ణ తమ గాత్రధారణలో పలు వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, బృదంగంపై పి.జయభాస్కర్, ఘటంపై ఎం.హరిబాబు, వాయిద్య సహకారం అందించారు. పి.ఎల్.జయతి, పి.ఎస్.మహతిలు శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజరాజేశ్వరి, పాటిబండ లలితాదేవి, ఎం.విజయలక్ష్మి, ఎ.మంగాదేవి, మాధవికృష్ణలు పాల్గొని కళాకారులను సత్కరించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఇంటెల్



**మేడికొండూరు:** గుంటూరు రగ్బి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 విభాగంలో ఇంటెల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాక్సింగ్‌లో అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన రోహిత్, బాస్కెట్‌బాల్ విభాగంలో సోహెల్ జిల్లా జట్టుకు స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కోనూరి రాణి జయకుమార్ శనివారం తెలిపారు. త్వరలో గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఆనంద్, శ్రీక్రాంత్, సంజయ్, యాసిన్, అజ్మల్, బాలికల విభాగంలో షేక్ ఆసియా, సుల్తానా, గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల పీఈటీ రన్‌హుస్సేన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాణి జయకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## మెడికల్ హాస్టల్‌లో పచ్చదనం పెంపునకు కృషి

**ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి**


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

**గుంటూరు మెడికల్:** హాస్టల్‌లో పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. అమరావతి రోడ్డులోని గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ భూగోళం నానాటికి వేడెక్కిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల ద్వారా ఆక్సిజన్‌తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందరికీ లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండి మొక్కలు నాటి, పచ్చదనం పెంపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, బోధన సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే బాధ్యతలను గుర్తించాలి


శాక్ విద్యార్థి విభాగంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి

**పెదకాకాని:** విద్యార్థి దశలోనే బాధ్యతలను గుర్తించి వాటిని స్వీకరించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాన్ని అందుకోగలుగుతారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో శనివారం 2023-24 సంవత్సరానికి ఎన్నికైన విద్యార్థి విభాగం శాక్ (స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్) సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి హాజరయ్యారు. సవాళ్ళ పరిష్కార మార్గాన్ని తెలిపేందుకు కళాశాలలో 21 విద్యార్థి శాఖలతో 126 మందితో ఏర్పాటు చేసిన విద్యార్థి విభాగం సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ప్రతినిధులన్నారు. నాయకత్వ లక్షణాలు కలిగిన విద్యార్థుల పర్యవేక్షణలో ప్రణాళికలకు తోడ్పాటు అందించే శాక్ వీవీఐటీ కళాశాల ప్రత్యేకమని తెలిపారు. శాక్ విభాగం వీవీఐటీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపును అందిస్తుందన్నారు. ఎన్నికైన 126 మంది శాక్ విద్యార్థులు కళాశాలలోని విద్యార్థులందరికీ వన్నె తెచ్చే విధంగా మెలుగుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. వీవీఐటీ విద్యార్థులకు మధుర స్మృతులను అందిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ శాక్ సభ్యులు కళాశాల నిర్వహణ, విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు అవసరమైన సహకారాలను అందిస్తారని తెలిపారు.

### సౌకర్యాల కల్పనపై ఢిల్లీ వైద్యబృందం సూచనలు

**తెనాలిఅర్బన్:** కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ముస్కాన్ ఎసెస్‌మెంట్ టీమ్ తెనాలి జిల్లా వైద్యశాల పర్యటన శనివారంతో ముగిసింది. తల్లిపిల్లల వైద్యశాలలోని ఓపీ, ఎస్ఎన్‌సీయూ, క్యాజువాలిటీ వంటి విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు డాక్టర్ పొన్ను రాజు, డాక్టర్ సునీత పలివాల్‌లు మాట్లాడుతూ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించినట్లు తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ముస్కాన్ టీమ్ రెండు రోజులు తమ వైద్యశాలలో పర్యటించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. నేషనల్ క్వాలిటీ కంట్రోల్ నార్మ్స్ ప్రకారం వైద్యశాల నిర్వహిస్తుందా లేదా అనేది పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలు, డైట్ వంటి వాటిపై ఆరాతీశారు. వారు ఇచ్చిన సూచనలను అమలు చేస్తూ మరింత మెరుగైన వైద్యాన్ని చిన్నారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'కృష్ణా నదీ జలాల పంపిణీపై కేంద్రం నిర్ణయం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం

**లక్ష్మీపురం:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణానదీ జలాల పంపిణీపై కేంద్ర మంత్రి మండలి తీర్మానం సరికాదని, రాష్ట్ర ప్రజల ఆందోళనను పరిగణలోకి తీసుకోవాలని సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సదాశివం మాట్లాడారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీ కోసం ప్రస్తుతమున్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కే బాధ్యత అప్పగించడం, కొత్త విధి విధానాలను ఖరారు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీం కోర్టులో వ్యాజ్యం నడుస్తుండగా, జలాల పంపిణీ బాధ్యతను కొత్తగా దానికెలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాగు రంగ నిపుణులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ కేంద్ర నిర్ణయం రాష్ట్రానికి శరాఘాతమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసమే కేంద్రం ఈ నిర్ణయం చేసిందని ఆరోపించారు. కేంద్ర కేబినెట్ నిర్ణయం సుప్రీం కోర్టులో నిలవదని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో 28 మందికి విద్యార్థినులకు ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

**నగరంపాలెం:** స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. డైకిన్ ఇండియా, హీరో మోటో కార్పొరేషన్, శ్రీసిటీ, టాటా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపారు. వివిధ కళాశాలల నుంచి 37 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఆన్‌లైన్ టెస్ట్, మౌఖిక పరీక్షలు నిర్వహించి, 28 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి కృష్ణవేణి, జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారాం, యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అభినందించారు.

## ఆంధ్ర క్రైస్తవ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు సత్కారం

**నగరంపాలెం:** ఆగస్టులో జరిగిన ఆర్మీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ పరీక్ష ఫలితాల్లో ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పి.రాజు (సీఐఎస్ఎఫ్), కె.సాయిబాబు (బీఎస్ఎఫ్), యూ.వి.వసంత్‌కుమార్ (ఆర్మీ) ఉద్యోగాలు సాధించారు. కళాశాల ఆవరణలో వీరిని శనివారం కరస్పాండెంట్ రెవరెండ్ డాక్టర్ కె.ఎఫ్.పరదేశిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.విజయకుమార్, డాక్టర్ కె.జోసఫ్, డాక్టర్ జి.ప్రీతం ప్రకాష్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.ఎం.వినయ్ తేజ్, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ కె.రవి, కేర్‌టేకర్ ఎల్.సాగర్, కార్యాలయపు మేనేజర్ డి.వెంగయ్య సత్కరించి, అభినందించారు.

## హిందూ ఫార్మసీ కళాశాలలో 'స్వచ్ఛత హీ సేవ'


కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, విద్యార్థినులు

**నగరంపాలెం:** స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వారోత్సవాల్లో భాగంగా శనివారం స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ విద్యార్థులంతా పరిసర ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.వి.నాగభూషణం, కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎ.రాజేష్, జె.శివజ్యోతి, ఎన్‌సీసీ ఏఎన్‌వో లెఫ్టినెంట్ సీహెచ్.అజిత్‌బాబు పాల్గొన్నారు.

## 15 నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

**గుంటూరు రూరల్:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీనుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్యామల రఘునాథ రెడ్డి, అర్చక స్వామి తుర్లపాటి ప్రసన్నాంజనేయకుమార్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఆదివారం అమ్మవారికి బాలాత్రిపురసుందరిదేవి అలంకారం, 16 గాయత్రీదేవి, 17 అన్నపూర్ణాదేవి, 18 మహాలక్ష్మీదేవి, 19 పార్వతీదేవి, 20 సరస్వతీదేవి, 21 లలితాదేవి, 22 దుర్గాదేవి, 23 మహిషాసుర మర్దిని(రజత కవచాలంకృత), మధ్యాహ్నం రాజరాజేశ్వరిదేవి అలంకారం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు పంచహారతుల కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు తమ పేర్లను ఆలయంలో తమ గోత్రనామాలతో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## సీహెచ్‌సీలో 24 గంటలూ వైద్య సేవలు

**ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యధిద్య**


అర్ధరాత్రి అత్యవసర వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ యధిద్య

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇకపై 24 గంటలూ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందనున్నాయని మత్తు వైద్యనిపుణుడు డాక్టర్ యధిద్య అన్నారు. శుక్రవారం అర్ధరాత్రి పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన జమ్ములమడుగు విజయమ్మ పాముకాటుకు గురయింది. దీంతో స్థానికులు ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అదే సమయంలో విధుల్లో ఉన్న డాక్టర్ యధిద్య ఆమెకు అత్యవసర వైద్యం అందించారు. గతంలో ఆస్పత్రికి ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఆస్పత్రికి వస్తే.. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సులు గుంటూరుకు రెఫర్ చేసేవారు. గుంటూరు వెళ్లేవరకు ప్రాణం ఉంటుందో పోతుందో తెలియని పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేశారు. దీంతో వైద్యులు రోస్టర్ విధానంలో అత్యవసర సమయాల్లోనూ అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ యధిద్య మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇకపై రౌండ్ ది క్లాక్ ప్రజలకు వైద్యం అందుతుందని ఆయన చెప్పారు. ప్రజలు ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు.